ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దు



వాటర్‌వర్క్స్ అధికారులతో మాట్లాడుతున్న నెమలి ఆనంద్

సనత్‌నగర్: ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా అధికారులు వ్యవహరించడంపై బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, సీనియర్ నేత నెమలి ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బేగంపేట డివిజన్ బ్రాహ్మణ వాడీ లేన్‌నెంబర్–3లో వాటర్‌వర్క్స్ విభాగం అధికారులు స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోకుండా కొత్తలైన్‌కు సంబంధించి పనులు చేపడుతున్నారంటూ పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న నెమలి ఆనంద్ విషయాన్ని వాటర్‌వర్క్స్ మేనేజర్ దృష్టికి తీసుకురాగా ఆయన తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. నెమలి ఆనంద్ విజ్ఞప్తి మేరకు వాటర్‌వర్క్స్ సిబ్బంది సమస్యను పరిష్కరించారు. ఆయన వెంట బీజేపీ ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు శ్రవణ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి నాని, బస్తీవాసులు రాంచందర్, పాండు, నవీన్, దేవేందర్ ఉన్నారు.

శ్రీదుర్గా హైస్కూల్‌లో లీడ్ కాన్ఫరెన్స్



వివిధ నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట లక్ష్మీనగర్‌లోని శ్రీ దుర్గా హైస్కూల్‌లో సోమవారం లీడ్ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రైమరీ విద్యార్థులు వివిధ పాఠ్యాంశాలపై రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా లీడ్స్ ప్రతినిధులు మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను మెరుగుపరిచేందుకు ఏడాదిలో రెండు సార్లు ఈ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాలపై యాక్టివిటీ ద్వారా విద్యార్థులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం. నర్సింహారెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'మాజీ డీజీపీ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలి'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర మాజీ డీజీపీ అంజనీకుమార్ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక సవరణ చట్టం 2015ను నిర్వీర్యం చేస్తూ జారీ చేసిన సర్క్యులర్ నెంబర్ 3340/2023ని వెంటనే రద్దు చేయాలని నేషనల్ అట్రాసిటీస్ ప్రివెన్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంప్రసాద్ మాట్లాడుతూ... 2018లో ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని నిర్వీర్యం చేసిన సుప్రీం కోర్టుకు వ్యతిరేక ఉద్యమంలో మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేసిన మాజీ డీజీపీ అంజనీకుమార్‌పై సెక్షన్ 4 ఆఫ్ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక సవరణ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అంజనీకుమార్ కుట్రపూరితంగా 30 శాతంకు పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కవచంగా ఉన్న ఈ చట్టాన్ని నిర్వీర్యం చేస్తు సర్క్యులర్ జారీ చేశారని ఆరోపించారు. జనరల్ లాకు సంబంధించిన సుప్రీం కోర్టు ఆదేశాలంటూ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ లాకు ఆపాదిస్తు 2/8/2003న సర్క్యులర్ నెంబర్ 3340/2023ను జారీ చేసి రాష్ట్రంలోని అన్ని పోలీస్ యూనిట్ ఆఫీసులకు ఉత్తర్వులు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సర్క్యులర్‌కు వ్యతిరేకంగా అన్ని జిల్లా కేంద్రాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించడంతో పాటు జిల్లా కలెక్టర్లు, కమిషనర్, ఎస్పీలకు వినతిపత్రాలు అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేషనల్ అట్రాసిటీస్ ప్రివెన్షన్ ఫోర్స్ ప్రధాన కార్యదర్శి గంగాధర్, పీఎంసీ కన్వీనర్ ఎస్.శివలింగం, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.శ్రీరాంనాయక్, నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞాన సముపార్జనకు నిలయం.. ఎస్‌ఆర్‌నగర్ గ్రంథాలయం

- అందుబాటులో 15 వేలకు పైగా పుస్తకాలు
- పాఠకులతో కిటకిటలాడుతున్న లైబ్రరీ

సనత్‌నగర్: లక్ష్యంపై గురి ఉండాలే కానీ.. అక్కడ దొరికే పుస్తక పరిజ్ఞానంతో పోటీ పరీక్షలను అలవోకగా ఎదుర్కోవచ్చు. సాహిత్యంపై అభిలాష ఉండాలే కానీ.. దాని సముపార్జనకు అక్కడ కొదువ లేదు. ప్రశాంతత కోరుకునే మనస్సులకు ఆధ్యాత్మికతత్వాన్ని నూరిపోసే గ్రంథరాజాలకు కేరాఫ్ అది. 'చరిత్ర' పుటల్లో దాగి ఉన్న విశేషాల గుట్టు విప్పే విజ్ఞాన గని. ఒక్కమాటలో చెప్పాలంటే సమస్త విజ్ఞాన వేదిక. వీటి కోసం వేలకు వేలు పోయాలేమో అనుకుంటున్నారా? అదేం లేదు. కేవలం రూ.100 రిఫండబుల్ ఫీజును చెల్లిస్తే చాలు జీవిత కాలం ఎవరికి కావాల్సిన విజ్ఞానదాయినిని పొందవచ్చు. అదే ఎస్‌ఆర్‌నగర్‌లోని హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ. తాజా సమాచారాన్ని మోసుకొచ్చే దిన పత్రికలతో పాటు వేలాది పుస్తకాల సమాహారంతో ఎంతోమందిని విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దుతోంది.

కాలంతో పోటీ పడుతూ..

ఎస్‌ఆర్‌నగర్ గ్రంథాలయం కాలంతో పోటీపడుతూ ఎప్పటికప్పుడు అప్‌డేట్ సమాచారాన్ని పాఠకుల ముందు ఉంచుతోంది. ఇక్కడ వివిధ భాషల్లో 15 వేల పైచిలుకు పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచారు. సాహిత్యం, నవలలు, పురాణగాథలు, ఇతిహాసం, చరిత్ర, చిన్న పిల్లల నీతి కథల పుస్తకాలు, రామాయణ, మహాభారత, భాగవతం వంటి ఆధ్యాత్మిక పుస్తకాలే కాకుండా కాలానికి అనుగుణంగా అధునాతన పరిజ్ఞానాన్ని జోడించిన పుస్తకాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నారు.



పఠనంలో నిమగ్నమైన విద్యార్థులు, పాఠకులు

అన్ని రకాల పత్రికలు..

గ్రూప్ ఎగ్జామ్స్, ఎస్‌ఐ, కానిస్టేబుల్, బీఈడీ, డీఎస్సీ, బ్యాంక్ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ ఇక్కడ లభ్యమవుతోంది. ఉద్యోగ సోపానం, విజేత కాంపిటీషన్స్, ప్రతియోగిత్‌దర్పన్, కాంపిటేటివ్ న్యూస్ మ్యాగజైన్ వంటి పలు రకాల పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ప్రధానంగా పేద విద్యార్థుల కెరీర్‌కు దోహద పడేవిధంగా ఇక్కడ స్టడీ మెటీరియల్ లభిస్తోంది. దీనికి తోడు లేటెస్ట్ సమాచారాన్ని చేరవేసేలా వివిధ భాషల్లో 12 రకాల దినపత్రికలు, 12 వార పత్రికలు, 2 పక్ష పత్రికలు, 14 మాస పత్రికలు ఇక్కడ నిత్యం అందుబాటులో ఉంటాయి.

విద్యార్థులే అధికం..

నగరంలోని చిక్కడపల్లి లైబ్రరీ తర్వాత స్థానం ఎస్‌ఆర్‌నగర్‌కే దక్కుతుందంటే అతిశయోక్తి కాదు. దాదాపు 300 మంది వరకు ప్రతిరోజూ ఈ లైబ్రరీకి వచ్చి ఎవరి స్థాయిలో వారు విజ్ఞాన గనిని తవ్వుకుంటారు. ఇక్కడికి వచ్చేవారిలో 80 శాతం మంది విద్యార్థులే కావడం గమనార్హం. చుట్టుపక్కల హాస్టళ్లలో ఉంటూ ఇక్కడికి వచ్చి వివిధ రకాల పుస్తకాలు, దినపత్రికలు, మ్యాగజైన్స్‌ను తిరగేస్తూ నాలెడ్జ్‌ను పెంచుకుంటున్నారు. కొందరు జాబ్ ఇంటర్వ్యూలో మెలకువలపై అవగాహన కోసం ఇక్కడికి వస్తే.. మరికొందరు గ్రూప్స్, బ్యాంక్, ఎస్‌ఐ వంటి పరీక్షల ప్రిపరేషన్ కోసం వస్తుంటారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు ఏ వేళలో చూసినా లైబ్రరీ పాఠకులతో నిండి ఉంటోంది.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



విజయ భవన్ వద్ద బైఠాయించిన పాడి రైతులు

లాలాపేట: తెలంగాణ పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (విజయ డెయిరీ)కు చెందిన పాడి రైతులకు రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో పాల బిల్లులు చెల్లించక మూడు నెలలు కావొస్తుంది. ఈ విషయమై స్థానిక అధికారులను అడుగగా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఈ మెదక్ జిల్లాకు చెందిన కొందరు పాడి రైతులు సోమవారం లాలాపేటలోని విజయ పాలనాభవన్ వద్దకు చేరుకున్నారు. పాల బిల్లులపై అధికారులెవరూ స్పందించకపోవడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిరసన వ్యక్తం చేస్తూ బైఠాయించారు. మధ్యాహ్నం అనంతరం విజయ డెయిరీ అధికారి జనరల్ మేనేజర్ కామేష్ లోపలికి పిలిపించి పాడి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడు రోజుల్లో పెండింగ్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పాడి రైతులు శాంతించారు. ఈ కార్యక్రమంలో అరవిందరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, భాస్కర్, రాజు తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలి

ముషీరాబాద్: మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ఆర్టీసీ ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్సుల సంఖ్యను వెంటనే పెంచాలని బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భోలక్‌పూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే తపనతో ముందస్తు ప్రణాళిక లేకుండా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసి ఆర్టీసీ ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆరోపించారు. బస్సులలో అధిక రద్దీ వల్ల ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికులకు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం అన్ని వర్గాల ప్రజలకు అమలయ్యేలా ప్రతి ఒక్కరికీ తెల్ల రేషన్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 55, పచ్చిమిర్చి 28, బజ్జీ మిర్చి 40, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 45, పందిరి బీర 55, క్యాబేజీ 15, క్యారెట్ 37, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 50, కీర 20, దోసకాయ 28, బీట్‌రూట్ 33, ఉల్లిగడ్డ 36, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 25, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

రూ.5 లక్షల ఆశచూపి రూ. 58 వేలు స్వాహా

అడ్డగుట్ట: ఆన్‌లైన్‌లో పర్సనల్ లోన్ ఆశ చూపించి రూ. 58 వేలు కాజేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ దయాకర్ వివరాల ప్రకారం.. తుకారాంగేట్‌లోని సాయినగర్ ప్రాంతానికి చెందిన అనీల్ (46) ప్రైవేటు ఉద్యోగి. ఇటీవల ఫేస్‌బుక్ చూస్తుండగా ఇండియా బుల్స్ ఫైనాన్స్ అనే యాప్‌లో రూ. 5 లక్షల పర్సనల్ లోన్ మంజూరైనట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే అనీల్ అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేయగా రూ.5 లక్షల లోన్ మంజూరైనట్లు చెప్పారు. లోన్ అప్రూవల్ కోసం కొంత డబ్బు కంపెనీకి చెల్లించాలని మాయమాటలు చెప్పి సుమారు రూ. 58 వేలు అనీల్ ద్వారా కట్టించుకున్నారు. రోజులు గడుస్తున్నా లోన్ ఇవ్వకపోవడం, ఫైనాన్స్ యాప్‌కు సంబంధించిన వాళ్లు స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి సోమవారం పోలీసులకు ఆశ్రయించాడు.



క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పద్మారావుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ప్రజల రుణం తీర్చుకుంటా

చిలకలగూడ: నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని, రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తూ అన్ని రంగాల్లోనూ సికింద్రాబాద్‌ను అగ్రస్థానంలో నిలబెడతానని ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించిన ఆయన మూడో విజయం తర్వాత మొదటిసారిగా సోమవారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో అడుగు పెట్టారు. వేదపండితులు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతోనే స్థానిక ప్రజలు హ్యాట్రిక్ విజయం అందించారని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కాకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా కల్పించిన అధికారాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తానని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, శైలజ, నాయకులు రామేశ్వరగౌడ్, కరాటే రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పోలీస్ అధికారులు..



శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీస్ అధికారులు

చిలకలగూడ : చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి నేతృత్వంలో వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన పద్మారావును పలువురు పోలీస్ అధికారులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ స్టేషన్ హౌస్‌ఆఫీసర్లు (ఎస్‌హెచ్ఓ) మట్టంరాజు, శంకర్, మధులతలు ఎమ్మెల్యే పద్మారావును కలిసారు. ఆయా ఠాణాల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు మరింత కృషి చేయాలని పోలీస్ అధికారులకు ఆయన సూచించారు.

తలసానికి అభినందనల వెల్లువ



తలసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న రవీంద్రనగర్ కాలనీ ప్రతినిధులు

సనత్‌నగర్: మూడోసారి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను నియోజకవర్గానికి చెందిన పలువురు సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు. సనత్‌నగర్ డివిజన్‌లోని రవీంద్రనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌సింగ్, ఉపాధ్యక్షుడు ఎన్వీ రమణారెడ్డి, సుదర్శన్, రాంరెడ్డి, ముఖ్య సలహాదారులు రాపాల సత్యానారాయణ, సూర్యనారాయణ ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



లాస్యనందితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గంలో అభివృద్ధిలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే లాస్యనందిత కోరారు. కార్ఖాన క్యాంపు కార్యాలయంలో సోమవారం సికింద్రాబాద్ పెరుమాళ్ టెంపుల్ ఆలయ ట్రస్టు మాజీ సభ్యుడు సురేష్ ఆధ్వర్యంలో బొలంరాయికి చెందిన పలువురు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా లాస్య మాట్లాడుతూ.. త్వరలో నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో పర్యటిస్తానని తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో శ్యాంరావు, శివానంద్, భగత్, సందీప్ పాల్గొన్నారు.



రోడ్లు ఛిద్రం అడుగు భద్రం

- గుంతలమయంగా అంతర్గత రహదారులు
- రాకపోకలకు ఇబ్బందులు
- మరమ్మతులు చేయాలంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

సికింద్రాబాద్ నియోజకవర్గంలో అంతర్గత రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. గతుకులు, గుంతలతో ఛిద్రమైన రోడ్లు ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. గుంతలమయంగా మారిన రహదారులతో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నామని వాహనదారులు, బాటసారులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో వీధిదీపాలు వెలగని ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉందని వృద్ధులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో రెండు నెలల ముందు హడావుడిగా ప్రతిరోజు 15 నుంచి 20 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయగా, ఎన్నికల ముగిసి ఫలితాలు వెలువడిన తర్వాత ఆయా నిర్మాణ పనులు చేపట్టకపోవడం పట్ల ఆయా ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా రోడ్లు వేసేందుకు ఉన్న రహదారులను తవ్వేసి అర్ధాంతరంగా వదిలేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. తార్నాక, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్, అడ్డగుట్ట, మెట్టుగూడ డివిజన్ల పరిధిలో అభివృద్ధి, అంతర్గత రహదారుల నిర్మాణ పనులు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. – చిలకలగూడ







సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికుల సమస్యలు వింటున్న కార్పొరేటర్ శైలజ

బౌద్ధనగర్: స్థానిక సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తామని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. సోమవారం ఏఆర్‌కేనగర్‌లో ఆమె పర్యటిస్తూ మాట్లాడారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని స్థానికులకు సూచించారు. డ్రైనేజీ, రోడ్డు సమస్యలను వెంటనే పరిష్కరించాలని జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

లాలాపేట: జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్–370ని రద్దు చేయడాన్ని సమర్థించిన దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు సోమవారం తీర్పు వెలువరించడంపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. లాలాపేట నుంచి తార్నాక వరకు జాతీయ పతాకాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భారతదేశ విశాల ప్రయోజనాల కోసం ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 370 ఆర్టికల్‌ను రద్దు చేశారని వివరించారు. దీంతో దేశంలోని ప్రజలందరికి సమాన హక్కులు ఉండాలనేదే దీని ఉద్దేశం అన్నారు. తార్నాక డివిజన్ బీజేపీ అధ్యక్షులు రాము వర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, వేణుయాదవ్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌చారి, మోహన్, వేణు, కృష్ణమూర్తి, ఎల్లయ్య, గోవర్ధన్, ప్రమోద్, సాయి, కిషోర్ పాల్గొన్నారు.

